# అహం

నేను చాలాసార్లు చూసినచోటే అది. ఎన్నో ఏళ్లుగా ఎరిగున్న పరిసరాలే అవి. ఆ ప్రాంతంలో సంచరించే చాలామంది జనం నాకు బాగా పరిచయం వున్నవాళ్లే. అయినా ఆ మలుపు దగ్గర ఆ డేరా చూసినప్పుడల్లా స్వల్పంగానైనా మనసుకి అస్థిమితం తప్పటంలేదు. ఆ డేరా తాలూకు వ్యక్తులూ వాళ్లజీవితం ఎన్నో ఏళ్లగా తెలిసీ నా మనసు అలా ఎందుకు తొట్రు పడుతుందో చాలాసార్లు ఆలోచించాను. ఇదమిద్ధంగా ఇందుకు అన్న భావన నాకు తట్టలేదు. కానీ అక్కడ నా కళ్లబడే జీవితం మటుకు సజావైన బతుకుకాదని అంతర్గతంగా నా మనసుకు తెలుసు.

నిజానికి రోడ్డు అక్కడ పెద్ద మలుపేం తిరగదు. అక్కడున్న విశాలమైన వో ప్రభుత్వ భవంతి కాంపౌండ్ గోడపక్కనున్న చిన్నరోడ్డు మెయిన్ రోడ్డుని కలుస్తుంది. ఆ రకంగా కలవటంతో కాంపౌండ్ గోడకి రోడ్డుకి మధ్య మలుపులా ఏర్పడ్డ త్రిభుజాకార స్థలం అది.

ఆ చుట్టుపక్కల పోగేసిన చెత్తవేసే చోటూ అదే. చెత్త వెయ్యటానికి కంటెయినర్స్ వున్నా అవి ఎప్పుడూ నిండిపోయినట్టు

చెత్తంతా ఆ చుట్టూ పడివుంటుంది. ఆ చెత్తకి ఇరవై గజాల వెనగ్గా ఆ ప్రభుత్వభవనం గోడ ఆధారంగా ఓ పది అడుగుల నేలని చిరిగిన టార్పాలిన్ కప్పుతో ఇల్లుగా కూర్చుకున్న దేరా అది. ఆ దేరాయే తన ఆస్తిగా బతుకుతోంది ఫాతిమా.

మధ్య వయసు మళ్ళుతున్న శరీరం ఫాతిమాది. అప్పుడప్పుడూ ఆమె తలలో పెట్టుకునే మల్లెపూల వాసనకి, చుట్టూ వున్న చెత్తలోంచి నిత్యం వచ్చే కుళ్లు వాసనకి చాలా వరకూ తేడా మరిచిపోయింది ఆమె. ఎప్పటి అందమో, ఏనాటి ఆరోగ్యమో ఇంకా కొంచెం మిగిలిఉన్నాం అంటూ తొంగి చూస్తున్న శిథిల శరీరం ఫాతిమాది. మెలకువగా వున్నంతసేపూ మాట్లాడుతూనే కనపడుతుంది. పరికించిచూస్తే ప్రతి పది మాటలకి కనీసం ఒక నవ్వు నవ్వినట్టు వుంటుంది ఆమె ముఖం.

ఇప్పుడు ఫాతిమా నవ్వినా, మాట్లాడినా ఎవరైనా మగాడితో గడిపినా, మెళకువగా వున్నా కేవలం తాగుడు కోసమే. తాగడం కోసమే బతుకుతున్నట్టున్న ఆమె పట్ల నా కుతూహలానికి కారణం ఏమిటో స్పష్టంగా నాకే తెలియదు. అటువేపు వెళ్లినప్పుడు ఆ దేరావేపు, ఫాతిమాకోసం నా చూపులు తారట్లాట్టం నాకే అయోమయంగా ఉంటుంది. ఎందుకు? అని ప్రశ్నించుకుంటే కొన్ని సవ్యమైన సమాధానాలుతోచినా ఎక్కువగా అపసవ్యమైన ఊహలే రావడం జరుగుతోంది.

నా కుతూహలంవల్ల ఫాతిమా గురించి నాకు కొన్ని విషయాలు తెలిశాయి. ఎప్పుడు, ఎక్కడ్నించి వచ్చిందో సరిగ్గా ఎవరికీ తెలియదు. వొళ్లు అమ్ముకోవడం, అడుక్కోవడం, చిన్న చిన్న పనులు వ్యాపారాలు చెయ్యడం ఇలా ఎలా వీలైతే అలా బతికింది. అనేకానేక మజిలీలు దాటి ఇప్పటికి ఇలా కేవలం తాగుబోతులా మిగిలింది. ఇప్పుడు తాగడంకోసం ఏమైనా చేస్తుంది. తాగేసి వొళ్లు తెలియకుండా పడిపోతుంది. తనకేం జరిగినా తనకేం పట్టనట్టు బతికే ఆ బతుకులో ఏముందో ఎవరూ సరిగ్గా చెప్పలేరు. ఆమెతోటి వారే ఆమెని తిడుతుంటారు. అసహ్యించుకుంటారు.

ఏమాత్రం వొంటిమీద స్పృహ లేకుండా ఆ దేరా ముందు చెత్తలో, మురికిలో, కుళ్ళువాసన మధ్య శరీరం వున్నా లేని ప్రాణిలా ఫాతిమా పడివుండగా నేను ఎన్నోసార్లు చూశాను. రాత్రి చీకట్లోనే కాదు. తెల్లారిన తొలి వెలుగులోనే కాదు. బాగా ఎండెక్కిన పది గంటలవేళ ఆమె అలా పడివుండగా చాలామంది వో వింతలా చూడ్డం కూడా నేను చూశాను. వెలుగుని తట్టుకోలేనట్టు బతికే ఆ నిర్జీవ స్త్రీ పట్ల ఎవరికైనా జాలి కలుగుతుంది. ఆమె బతుకు చుట్టూ వున్న దైన్యం చూసి తట్టుకోలేంది. అటు వెళ్లినప్పుడు ఫాతిమానేకాదు ఆ దేరాలో వుండే ఫాతిమా కొడుకునీ అలాగే చూపులతో వెతుక్కుంటున్నట్టు చూస్తాను. అయిదేళ్ల పసివాడుగా వున్నప్పట్నించీ వాణ్ని చూస్తున్నాను ఇప్పుడు వాడికి పదేళ్లు. చిన్నతనంలో ఆ దేరా దగ్గరే చెత్తాచెదారంలో ఆడుకుంటూ

వుండేవాడు. ఆ రోజుల్లో ఫాతిమా వాణ్ని ముద్దులాడ్డం చూశాను. వాడికి కొంచెం వయసొచ్చి ఎదుగుతున్న సమయంలో ఫాతిమా తాగుడు పెరిగిపోయింది. ఇప్పుడు ఎక్కువ సమయం వొళ్లు తెలియని స్థితిలోనే ఉంటుంది.

ఆ పరిసరాల్లో ఫాతిమాలాంటి వాళ్లు చాలామంది ఉన్నారు. వాళ్లకి ఆడా మగా చిన్నా పెద్దా తేడాలేదు. సహజమైన బతుక్కి ఎదురీతలాంటి బతుకువాళ్లది.జేబులు కొడతారు. మోసాలు చేస్తారు. అడుక్కుంటారు. ఏ రోజు తింటారో.. ఎప్పుడు ఎక్కడ ఉంటారో.. ఏ క్షణాన ఎలా చచ్చిపోతారో.. ఎవరికీ అక్కర్లేని జీవితం వాళ్లది.వాళ్ల బతుకులే దరిద్రం అనుకుంటే వాళ్లకన్నా దరిద్రం ఫాతిమా జీవితం. రోజులో కొంతసేపు ఒక శవానికి మెళకువొచ్చినట్టు బతుకుతోంది ఫాతిమా.

వొళ్లెరగని తాగుడు మత్తులో బట్టలు చెదిరిన ఫాతిమా నగ్న శరీరాన్ని ఎందరెందరో చూశారు. కొన్ని గంటలసేపు కొందరికి అది ఖర్చులేని వినోదం.

ఫాతిమా కొడుకు పదేళ్ల పసివాడు. ఆ తల్లి తొలిగిన బట్టల్ని వాడు సరిచెయ్యడం ఎన్నోసార్లు చూశాను. అలాంటివి చూసినప్పుడు జాలేకాదు.. బలంగా మరేదో మనసుని కలిచేస్తుంది. పదేళ్ల పసివాడు చూడకూడనివి ఎన్నో చూస్తున్నాడు ఆ దేరా జీవితంలో వాడు.

అలాంటి జీవితంలో పెద్దయ్యాక ఎలా మారతాడు? అసలు వాడికి అలాంటి జీవితం ఎందుకుండాలి? దానికి కారణం ఫాతిమాయే అన్నది నాకున్న కోపం. ఫాతిమా మనసులో ఎన్ని విషాదాలున్నాయో, ఎన్ని కన్నీటి నదులున్నాయో నాకు తెలీదు. అయినా ఆ పసివాడి బతుకుని ఆ తల్లి అలా గాలిబతుకు చెయ్యకూడదనే నా బాధ. కన్నతల్లికి కొడుకుకన్నా తాగుడు ఎక్కువైపోతే ఎలా అన్న దుగ్ధ.

అదోరకం దైన్యం ఆ దేరా చుట్టూ... అటు వెళ్లకుండా వుండలేను. వెళ్లి ఏం చెయ్యలేను.

కొన్నేళ్లు గడిచినా.. అదేదారి. అదే మలుపు.. దేరా వేపే చూస్తున్నాను.

"ఏంటి సార్ అటు చూస్తున్నారు" అన్నాడు వెనకనుంచి.

వెనక్కి తిరిగి చూశాను. దేరావేపు సాగిన నా చూపుల్ని పట్టుకున్నట్టు నవ్వుతున్నాడు నల్లోడు.

వాణ్ని ఆ చుట్టుపక్కల వాళ్లందరూ నల్లోడే అంటారు. చిన్న సైజు రౌడీ అని పేరు. "రా.. కాఫీ తాగుదాం" అన్నాను. వాడు చిన్న చిన్న పనులకి, అయిదూ,పదీ అప్పుకి అప్పుడప్పుడూ నా దగ్గరికి వస్తుంటాడు. చాలా వరకు వాడి ద్వారానే నాకు ఆ చుట్టుపక్కల వాళ్ల సమాచారం తెలిసేది.

"ఏంటిసార్.. చాలాసార్లు చూశా మీరు ఆ డేరావేపు చూడ్డం. దానిమీద ఏమైనా మనసుంటే చెప్పండి" అన్నాడు నల్లోడు మేం కూచున్నాక.

"ఛీ...ఛీ" అన్నాను గబుక్కున. పాతిమా స్త్రీ అన్న స్పృహ వుంది నాకు. కానీ ఆమె శరీరం స్త్రీ శరీరం అన్న భావన లేదు నాకు.

"మరేమిటి సార్" అన్నాడు నల్లోడు నెమ్మదిగా. ఏం చెప్పాలి.. ఏమిటో సరిగ్గా నాకే తెలియదు. అయినా ప్రయత్నం.

"ఫాతిమా అలా వుండటం బాధగా ఉంటుంది నల్లోడా. దానికన్నా ఆమె కన్న కొడుకు ఆ తల్లిని అలా చూస్తూ బతకడం మరీ బాధగా ఉంటుంది. అసలే తండ్రిలేని పసివాడు. ఫాతిమాకి తన వొళ్లేమిటో తనకి తెలియనప్పుడు... అసలు తనకి బతకే అక్కర్లేనప్పుడు ఈ కొడుకు మాత్రం ఎందుకు? ఇంత ఆరితేరిన తిరుగుబోతు కదా కడుపురాకుండా చూసుకోలేకపోయిందా?" అన్నాను ఆవేశంగా. అంతేకాదు. ఇంకా చాలా చాలా అన్నాను. అన్నీ విన్నాడు నల్లోడు. విని గమ్మత్తుగా నవ్వాడు.

"బలేవారే సార్.. మీ అంతట మీరు అన్నీ ఊహించేసుకోటమేనా... ఆ మస్తాన్ ఫాతిమా కొడుకని మీ కెవరు చెప్పారు.."

"ఆ కుర్రాడి పేరు మస్తానా?" అన్నాను. అవునన్నట్టు తలూపాడు నల్లోడు.

"అయితే వాడు ఫాతిమా కొడుకు కాదా.." అన్నాను ఆశ్చర్యంగా.

"కొడుకే సార్. కానీ కన్నకొడుకు కాదు పెంచుకున్న కొడుకు"

నల్లోడు తిరిగి మాట్లాడేలోపే నా ఆలోచన పరిపరివిధాలా పోయింది. తన బతుక్కే దిక్కులేని స్థితిలో ఫాతిమా ఆ కుర్రాణ్ని పెంచుకోవటం ఏమిటో?

"అదో చిత్రమ్మ సార్.. పదేళ్ల క్రితం మస్తాన్‌గాడు నెలల గుడ్డుగా ఉండగా ఎవరో ఇక్కడ వదిలేసిపోయారు సార్. ఆ పసోణ్ని ఎవరో కావాలనే వదిలేశారని తెలిసేక మూడుగంటలు గడిచినా ఎవరూ ముందుకు రాలేదు. మా బతుక్కే గతిలేదు... వీడెందుకన్నారు.. అందరూ చూసి వెళ్లిపోయేవాళ్లు.. అలా మరో గంట గడిస్తే వాడు అప్పుడే చచ్చిపోయుండేవాడు..కానీ అప్పుడే వచ్చిన ఫాతిమా విషయం తెలుసుకుని వెంటనే వాణ్ని ఎత్తుకుంది. అప్పట్నించి అదే వాడి అమ్మ.. వాడే దాని కొడుకు."

ఆ తర్వాత నల్లోడు చాలా విషయాలు చెప్పాడు. ఫాతిమాని ఎందరు ఎన్ని రకాలుగా మోసం చేశారో చెప్పాడు. బాగా బతికిన రోజుల్లో ఆమెతో మాట్లాడినా, కలిసి గడిపినా ఫాతిమా దగ్గర ఎంత ప్రేమ దొరికేదో చెప్పాడు.

అలా చెప్పి "దాని మనసు చాలా మంచిది సార్.. అందరి పట్లా అది చూపించిన ప్రేమే దాన్నిలా చేసింది సార్. మాకున్న బండతనం దానికి లేదు.. అందుకే ఇలా తాగి

తాగి చస్తోంది" అన్నాడు.

తల్లిగా ఫాతిమా ద్రోహం చేసిందనుకున్న నా వూహలూ, కోపం, జాలీ అన్నీ తారుమారయ్యాయి.

మస్తాన్ విషయంలో ఫాతిమా చేసినపని సామాన్యమైంది కాదు. దెబ్బతిన్న జీవితాలు చాలా వుంటాయి. కానీ అటువంటి స్థితిలో ఔదార్యం చూపించగలగటం.. మనిషిలా మెత్తగా మార్దవంగా ప్రవర్తించగలగటం తేలిక కాదు. ఇంత తెలిసినా నా మనసులో ఇంకా వెలితిగానే ఉంది. అంతా సజావుగా జరిగినా నా మనసు అలా వెలితిగా ఎందుకుందని తరచి, తరచి చూసుకుంటే....

.....ఒక పసివాడి జీవితం అపసవ్యంగా ఉందన్న బాధ కొంతవరకూ కారణం అయితే.. నాకు తెలుసు అన్న భావన తాలూకు అహం... ఒక స్త్రీని, అందులోనూ ఒక తల్లిని తక్కువగా వూహించిన తప్పు.. మరింత పెద్ద కారణాలు.

ఎవరి తప్పులు వాళ్లు విశ్లేషించుకుంటే, నేను అన్న అహంకారపు పొరని దాటి తమలోకి తాము చూసుకుంటే చాలా మార్పులొస్తాయి. ఇప్పుడు ఫాతిమా మీద నాకు కోపంలేదు. అంత దుర్గంధంలోనూ తను సువాసన వెదజల్లే తల్లి అనే భావనుంది. అంతేకాదు అటువంటి స్థితిలో కూడా మస్తాన్‌కి ఆ తల్లిని బాగు చేయాలన్న తపన ఉందని తెలిశాక మరింత హాయిగా ఉంది.

– ఉదయం వారపత్రిక 18-01-1991